'కాశ్మీర్ సమస్య'పైన
ముషార్రఫ్ నోట అమెరికా మాట ఎందుకు వినపడుతున్నట్టు?

- కె. బాలగోపాల్

ముషార్రఫ్ ఈ మధ్య కాశ్మీర్ విషయంలో చేసిన రెండు ప్రకటనలు మీడియాలో బాగా ప్రచారం అయ్యాయి. పాకిస్తాన్ కాశ్మీర్‌ను కోరుకొనడం లేదనీ, కాశ్మీర్ భవితవ్యాన్ని కాశ్మీరీలే నిర్ణయించాలని మాత్రమే అంటున్నదనీ అన్నాడు. పాకిస్తాన్‌లో కొంత మందికి ఇది నచ్చలేదు. ముషార్రఫ్ అమెరికాను, భారత్‌నూ మెప్పించడానికి కాశ్మీర్ విషయంలో పాకిస్తాన్ ఇప్పటిదాకా అనుసరిస్తూ వస్తున్న అచంచలమైన వైఖరి నుండి వైదొలగాడని జమాతె ఇస్లామి ప్రతినిధులు అతని మీద ఆరోపణ చేసారు.

నిజానికి ముషార్రఫ్ పాకిస్తాన్ రాజ్య ప్రయోజనాల దృష్ట్యా చాలా తెలివిగా వ్యవహరించారని చెప్పాలి. పాకిస్తాన్ పాలకుల అభిప్రాయంలో కాశ్మీర్ వివాదాస్పద భూభాగం కావడానికి కారణం ఆదేశాన్ని భారత్‌లో విలీనం చేసిన రాజు చర్యపైన ప్రజాభిప్రాయ సేకరణ ఇప్పటిదాకా జరపకపోవడం కాదు. అటువంటి ప్రజాభిప్రాయ సేకరణ జరిపితీరుతామనీ, జరిపి ప్రజామోదం పొందినప్పుడే విలీనం పూర్తయినట్టు భావిస్తామనీ భారత పాలకులు కాశ్మీర్ ప్రజలకే కాక ఐక్య రాజ్యసమితికి కూడ హామీ యిచ్చారు. ఆ హామీని తప్పించుకోవడానికి ఆడిన నాటకాల చరిత్రే కాశ్మీర్‌కు సంబంధించినంత వరకు గత యాభై ఏళ్ల భారత చరిత్ర.

దీనిని పాకిస్తాన్ సహజంగానే వేలెత్తి చూపుతుందిగాని, పాకిస్తాన్ అధికారిక దృష్టిలో 'కాశ్మీర్ సమస్య' ఇది కాదు. దేశ విభజన జరిగినప్పుడు ముస్లింలు మెజారిటీగా ఉన్న రాష్ట్రాలన్నీ పాకిస్తాన్‌లో చేరాయనీ, ఒక్క జమ్ము కాశ్మీర్ మాత్రమే హరిసింగ్ - నెహ్రూల కుయుక్తులవల్ల, షేక్ అబ్దుల్లా నమ్మకద్రోహం వల్ల, ఇండియాలోకి పోయిందనీ, ఇది అన్యాయమనీ వారి అభిప్రాయం. అధికారిక పాకిస్తానీ దృక్పథంలో ఇదే 'కాశ్మీర్ సమస్య'. ద్విజాతి సిద్ధాంతపు మిగిలిపోయిన కర్తవ్యం అయిన కాశ్మీర్ విముక్తిని కాశ్మీరీల స్వయం నిర్ణయాధికార సమస్యగా ముషార్రఫ్ చెప్పడం సంప్రదాయవాదులకు నచ్చ లేదు.

కానీ ముషార్రఫ్ కు కొన్ని చారిత్రక వాస్తవాలు తెలియకుండా పోయే అవకాశం లేదు. హరిసింగ్ పరిపాలించిన జమ్ముకాశ్మీర్ రాజ్యంలో ముస్లింలు మెజారిటీ అన్నది వాస్తవమే. ఒక్క కాశ్మీర్‌లోయలోనే కాదు, అప్పటి జమ్ము ప్రాంతంలోనూ ముస్లింలే మెజారిటీ. ఒక లడఖ్‌లో మాత్రమే ముస్లింలూ బౌద్ధులూ దాదాపు చెరి సగం ఉంటారు. లాహోర్ రాజు రంజిత్‌సింగ్‌ను ఓడించిన బ్రిటిష్ వాళ్లు ఆరాజ్యమంతటినీ బ్రిటిష్ ఇండియాలో కలుపుకొని ఉంటే, అందులో భాగమైన జమ్ము కాశ్మీర్ కూడ బ్రిటీష్ ఇండియాలో చేరి ఉండేది. దేశ విభజనప్పుడు పడమటి పంజాబ్‌లాగ, తూర్పు బెంగాల్ లాగ, సింధ్‌లాగ ఆ రాజ్యమంతా పాకిస్తాన్‌లో భాగమయి పోయి ఉండేది (బహుశా, జమ్ము, కటువా జిల్లాలు మాత్రం ఇండియాలోకి వచ్చి ఉండేవి). ఈ మేరకు పాకిస్తానీ సంప్రదాయవాదుల ఫిర్యాదులను అర్థం చేసుకోవచ్చు.

బ్రిటీష్ వాళ్ళు రంజిత్‌సింగ్ రాజ్యంలో తక్కిన భాగాన్ని బ్రిటిష్ ఇండియాలోకలుపు కున్నారు గానీ, జమ్ముకాశ్మీర్‌ను మాత్రం రంజిత్ సింగ్‌కు ద్రోహం చేసి బ్రిటిష్ వాళ్ల విజయానికి సహాయ పడిన డోగ్ర జమీందారు గులాబ్‌సింగ్‌కు అప్పగించారు. ఆ రాజ్యంలో చాలా భిన్నత్వం ఉన్నప్పటికీ రెండు మూడు వందల సంవత్సరాలు ఒకే పాలన కింద ఉండడం వల్ల ప్రజలలో తామంతా ఒకటన్న భావన ఏర్పడి ఉండవచ్చు. మెజారిటీ ముస్లింలు కాబట్టి ఆ రాజ్యం యావత్తు పాకిస్తాన్‌లో కలవాలని అన్నా, భారత్‌లో గానీ పాకిస్థాన్‌లో గానీ చేరకుండ స్వతంత్రంగా ఉండాలన్న ఆకాంక్ష బలంగా ఉండింది కాబట్టి ఆ నిర్ణయమే చేసినా, లేదా ప్రజాభిప్రాయ సేకరణ జరిపి మెజారిటీ నిర్ణయం ప్రకారం ఆరాజ్యం భవిష్యత్తు నిర్ణయించినా అర్థం ఉండేది.

కానీ 50 ఏళ్ళ తరువాత పరిస్థితి చాలా మారింది. వాస్తవాధీనరేఖ అనేది సరిహద్దు కాదని రాజకీయాల కోసం ఎంత చెప్పుకున్నా, మనుషుల మధ్య అది సరిహద్దే అయింది. పాత జమ్ము కాశ్మీర్ రాజ్యం ప్రాతిపదికన చేసే ఏ ఆలోచనకూ ఇప్పుడు అర్థం లేదు. మీర్‌పూర్ వాసులు, కొంతమేరకు ముజఫరాబాద్ వాసులు తమకు తాము పాకిస్తాన్‌లో భాగంగానే భావించుకుంటారు. భారత్‌లోని జమ్ము వాసులు మానసికంగా భారతీయులే. లడఖ్ వాసులు జమ్ముతోగానీ కాశ్మీర్‌తోగానీ మమేకం చెందరు. వాళ్లకు సాంస్కృతికంగా, జాతిపరంగా సాన్నిహిత్యం ఉండేది టిబెటన్లతో. టిబెట్ చైనాదేశపు వలస కాకపోతే టిబెట్‌తో కలవడానికి ఇష్ట

పడతారేమో. వారిలో సగభాగం (కార్గిల్‌లో మెజారిటీ) ముస్లిం లయినప్పటికీ షియాలు కావడం వల్ల పాకిస్తాన్‌లో కలవడానికి ఇష్టడపక పోవచ్చు. మొత్తానికి ఇష్టంగానో అయిష్టంగానో భారతీయులుగానే బతకడానికి లధాఖీలు సిద్ధపడి పోయినట్టున్నారు.

ఇక మిగిలింది కాశ్మీర్‌లోయ, జమ్ములో కాశ్మీరీలు నివసించే దోడా జిల్లా, బలమైన స్వాతంత్ర్య కాంక్ష ఇప్పటికీ ఉన్నది ఇక్కడే. పాకిస్తాన్‌లో దీని ప్రభావం ముజఫరాబాద్‌లో మాత్రం కొంత ఉంటుంది. కాశ్మీర్‌లోయలో 95 శాతం పైగా ముస్లింలు కాబట్టి ద్విజాతి సిద్ధాంతం ఆధారంగా ఆలోయను పాకిస్తాన్‌లో కలిపివేయాలని డిమాండ్ చేసే బదులు, వారికి స్వయం నిర్ణయాధికారం ఇమ్మనడం ప్రజాస్వామికంగానూ ఉంటుంది. అదే ఫలితాన్ని ఇస్తుంది అనే నిర్ణయానికి ముషారఫ్‌వచ్చాడు. ఇక్కడ గుర్తుంచుకోవలసిన విషయం ఏమిటంటే కాశ్మీర్ విషయంలో పాకిస్తాన్ స్వయం నిర్ణయాధికారం అన్న పదాన్ని ఎప్పుడు ప్రయోగించినా అందులో ఇండియా కావాలా పాకిస్తాన్ కావాలా అన్న రెండు ప్రత్యామ్నాయాలే తప్ప స్వాతంత్ర్యం అన్న మూడవ ప్రత్యామ్నాయం లేదు. అవి రెండే ఉంటే మెజారిటీ పాకిస్తాన్‌కే వోటు వేస్తారన్న ధీమా ముషార్రఫ్‌కు ఉన్నట్టయితే అది వాస్తవిక మైన అభిప్రాయమే. (మూడవ ప్రత్యామ్నాయం అన్నట్టయితే మెజారిటీ స్వాతంత్ర్యానికే వోటు వేస్తారనేది కాశ్మీర్ గురించి తెలిసిన వాళ్ళందరి అభిప్రాయం). చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే 1960 దాకా ఈ రెండు ప్రయత్యామ్నాయాలే ఇచ్చినట్టయితే మెజారిటీ వోట్లు ఇండియాకే పడి ఉండేవనేది కూడ చరిత్రకారులలో ఏకాభిప్రాయం ఉన్న విషయమే. పరిస్థితిని అక్కడినుండి ఇక్కడికి తీసుకొచ్చింది మన పాలకులే కాబట్టి ఎవరినీ ఆడిపోసుకొని ప్రయోజనం లేదు.

అయితే ముషార్రఫ్ అక్కడితో ఆగిపోలేదు. పాకిస్తాన్ మద్దతు ఇస్తున్నది కాశ్మీరీల స్వయం నిర్ణయాధికారానికేనని ఒక పక్క అంటూ, వారి నిర్ణయంతో నిమిత్తంలేని 'వరిష్కారాన్ని' ప్రతిపాదించాడు. ఈ పరిష్కారం కొంత కాలంగా అమెరికా నోట వినపడుతున్నది, ఢిల్లీలోని భారత ప్రభుత్వ విధానకర్తలు అవునంటున్నది కావడం కొంత ఆశ్చర్యం, చాలా ఆందోళనకలిగించే విషయం. భారత్, అమెరికా, పాకిస్తాన్ ఇంత అకస్మాత్తుగా 'కాశ్మీర్ సమస్య' పరిష్కారాన్ని గురించి ఏకాభిప్రాయానికి ఎందుకు వచ్చేస్తున్నట్టు?

ఈ పరిష్కారం సారాంశమేమిటంటే ఇటో అటో 'అడ్జస్ట్' అయిపోయిన ప్రాంతాలు శాశ్వతంగా భారత్‌లోనూ పాకిస్తాన్‌లోనూ భాగం అయిపోతాయి. ఉదాహరణకు జమ్ము మీర్‌పూర్ ఇంకా స్వయం నిర్ణయాధికారం, స్వాతంత్ర్యం అంటూ ఆందోళన చేస్తున్న ప్రాంతాలు (కాశ్మీర్‌లోయ, దోడా జిల్లా, బహుశా పాకిస్తాన్‌లోని ముజఫరాబాద్ ప్రాంతం) ఒక స్వయం ప్రతిపత్తిగల రాజ్యశకలంగా ఏర్పడుతుంది. ఈ ప్రాంతవాసులకు ఇండియాతోనూ, పాకిస్తాన్ తోనూ రాకపోకల స్వేచ్ఛ కొంత ఇవ్వబడుతుంది. వారి స్వయంప్రతిపత్తిపైన భారత పాకిస్తాన్‌ల ఉమ్మడి పర్యవేక్షణ, ఆ స్వయంప్రతిపత్తికి అమెరికా భరోసా, ఉంటాయి. చిన్న, చితక సవరణలతో ఈ ప్రతిపాదన బిల్‌క్లింటన్ కాలం నుండి వినపడుతున్నది. ఢిల్లీలోని బ్యూరోక్రాట్లలో 'ప్రాక్టికల్' అని పేరున్న వారు దీనికి మద్దతుగా మాట్లాడుతున్నారు. ఇప్పుడు మొట్టమొదటి సారిగా పాకిస్తాన్ నోటి నుండి కూడా ఇదే మాట వినపడుతున్నది.

ఈ 'పరిష్కారం' భారత పాకిస్తాన్ జాతీయ వాదుల అహాన్ని సంతృప్తి పరచడానికీ, అమెరికా పెత్తనాన్ని ఉపఖండంలో పెంచడానికీ తప్ప వేరే దేనికయినా పనికొస్తుందా? స్వాతంత్ర్యం కోరుకున్న పాపానికి కాశ్మీరీలు ఒకటి కాదు, మూడు పెత్తనాలకింద బతుకాలా? కాశ్మీర్ సమస్య' కాశ్మీరీల స్వయం నిర్ణయాధికార సమస్య అని ఎన్నిసార్లు చెప్పినా ఎక్కువ కాదు. అది కాశ్మీరీల సమస్యే తప్ప మన దేశంలో చాలా మంది భావిస్తున్నట్టు 'మన' సమస్య కాదు. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే కాశ్మీరీల వల్ల భారత్‌కు సమస్యరాలేదు. భారత్‌వల్ల, పాకిస్తాన్‌వల్ల, కాశ్మీరీలకు సమస్య వచ్చింది. దానికి ఏకైక పరిష్కారం, కాశ్మీరీలకు మూడు ప్రత్యామ్నాయాలు ఇచ్చి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టడం, దాని ఫలితం ఏమైనప్పటికీ భారత పాకిస్తాన్‌లు దానిని మన్నించడం.

ముషార్రఫ్ నోట అమెరికా మాట వినపడడం పాకిస్తానీల సంగతేమోగానీ కాశ్మీరీలకు చాలా కోపం తెప్పించి ఉంటుంది. పూర్తిగా సెక్యులర్ భావాలు గల కాశ్మీరీలు సహితం పాకిస్తాన్ అండ తమ స్వాతంత్ర్య కాంక్షలకు లభిస్తుందని నమ్ముకున్నారు. ఇప్పుడు పాకిస్తాన్ భారత్‌తోనూ అమెరికాతోనూ గొంతు కలిపి తమ స్వాతంత్ర్యా కాంక్షను తృణీకరించడం వారికి చాలా బాధ కలిగిస్తుంది.

కానీ కాలం వారి పక్షాన లేదు. ముస్లింలు నివసించే ఏ ప్రాంతంలోనయినా అలజడి ఉంటే ఇస్లామిక్ మతవాద సంస్థలు ఎదగడానికది అవకాశం కల్పిస్తుంది కాబట్టి అటువంటి అలజడులన్నింటినీ 'పరిష్కరించే'యాలనేది అమెరికా దృష్టి. న్యాయంగానే పరిష్కరించనక్కరలేదు. ఏదో ఒకరకంగా పరిష్కరించేసి చల్లారిస్తే అమెరికా అవసరం తీరిపోతుంది. భారత పాకిస్తాన్‌లు కాశ్మీర్ భూభాగం గురించి ఘర్షించుకుంటున్నాయా? అయితే ఇద్దరికీ కాశ్మీర్‌లో హక్కులు కల్పించేద్దాం. అది స్థిరంగా ఉండక పోవచ్చునా? అయితే వారిపైన అమెరికా అజమాయిషీ నెలకొల్పుదాం. అమెరికా కొంత కాలంగా సూచిస్తూ, ఇప్పుడు ముషార్రప్ వంత పాడుతున్న 'పరిష్కారానికి' ఇంతకంటె తర్కంలేదు. ఇదే అమలు అయితే కాశ్మీరీలకు నిస్సందేహంగా చాలా అన్యాయం జరుగుతుంది. కాని వారి గోడు ఎవరికి పట్టింది?

☆ ☆ ☆